"కొత్త సంవత్సరములో అనుభవీ మూర్తులుగా అయ్యి అందరినీ అనుభవజ్ఞులుగా చెయ్యండి"

(శాంతివనములోని డైమండ్ జూబ్లీ హాల్ ప్రారంభోత్సవము సందర్భంగా)

ఈ రోజు దృష్టితో తృప్తి పరిచే బాప్ దాదా అతి స్నేహీలు, సహయోగులు మరియు స్నేహములో లవలీనమయ్యే పిల్లలైన మిమ్మల్నందరినీ చూస్తున్నారు. పిల్లలు ప్రతి ఒక్కరి మస్తకములో, హృదయంలో స్నేహము యొక్క ఋజువు కనిపిస్తూ ఉంది. (హాల్ లో వెనుక ఉన్న సోదర-సోదరీలతో) మేము వెనుక ఉన్నాము కావున కనిపించము అని మీరు అనుకుంటారు కానీ బాప్ దాదా నయనాలలో ఎంత అద్భుతమైన టి.వి. ఉందంటే దాని వలన దూరంలో ఉన్న వస్తువు కూడా ఎదురుగా కనిపిస్తూ ఉంటుంది. ఎక్కడ, ఏ మూల కూర్చున్నా కానీ తండ్రి ఎదురుగా ఉన్నారు. ఎంతైనా ఇప్పుడైతే ప్రశాంతంగా కూర్చున్నారు కదా. (చప్పట్లు కొట్టారు) ఈ రోజు చాలా ఉల్లాస-ఉత్సాహాలు మరియు సంతోషము ఉంది కదా, అది చప్పట్ల ద్వారా చూపిస్తున్నారు. కానీ బాప్ దాదాకు మీ మనసులోని సంతోషము తెలుసు. బాప్ దాదా చూస్తున్నారు - పిల్లలు ప్రతి ఒక్కరికీ సహయోగమనే ఋజువును ఇవ్వటంలో చాలా సంతోషము ఉంటుంది, అందుకే వేలాది భుజాలను చూపించారు. భుజాలు అనేవి సహయోగానికి గుర్తు. బాప్ దాదాకు తెలుసు - పిల్లలు ప్రతి ఒక్కరూ నలువైపులా, అది దేశంలోనైనా లేక విదేశాలలోనైనా, అందరూ ధనం ద్వారానైనా, మనస్సు ద్వారానైనా, తనువు ద్వారానైనా సహయోగాన్ని తప్పకుండా ఇచ్చారు. మరియు మీ అందరి సహయోగానికి ఋజువుగా ఈ రోజు మీరు ప్రశాంతంగా కూర్చుని చూస్తున్నారు కూడా, వింటున్నారు కూడా. ఇప్పుడు ఎక్కువ చప్పట్లు కొట్టకండి. మీ మనసులోని సంతోషం యొక్క చప్పట్లు బాప్ దాదా వద్దకు చేరుకున్నాయి.

చూడండి, ఈ రోజు రెండు విశేషతలు ఉన్నాయి. ఒకటేమో, అందరూ ఎంతో ఉల్లాస-ఉత్సాహాలతో తయారుచేసిన ఈ శాంతివనాన్ని బాప్ దాదాతో పాటు పిల్లలైన మీరు కూడా ప్రారంభిస్తున్నారు. రెండవది, ఈ రోజు డ్రామా అనుసారంగా కొత్త సంవత్సరము కూడా ప్రారంభమవ్వనున్నది, అందుకే బాప్ దాదా పిల్లలందరినీ తన రెండు బాహువులలో ఇముడ్చుకుంటూ ఈ రెండు విషయాలకు అభినందనలను ఇస్తున్నారు. అంతేకాక ఏ విధంగా ఇప్పుడు ఈ సమయంలో సాకార రూపంలో తండ్రితోపాటు ఉల్లాస-ఉత్సాహాలు మరియు సంతోషములో నాట్యం చేస్తున్నారో, అలాగే కొత్త సంవత్సరంలో సదా, సదా అవ్యక్త రూపంలో సహచరులుగా భావించండి, అనుభవం చేయండి, ఈ తోడు యొక్క అనుభవము చాలా ప్రియమైనది. బాప్ దాదాకు కూడా పిల్లలు లేకుండా మంచిగా అనిపించదు. (మైక్ ఆగిపోయింది) మొట్టమొదటి అనుభవం కదా, అందుకే ఇది కూడా డ్రామాలో ఆటగా భావించాలి, ఏదో కింద-మీద అయిపోయిందని అనుకోకండి. అంతా మంచిగా ఉంది మరియు మంచిగానే ఉంటుంది. చాలా మంచిగా ఉంది, చాలా మంచిగా ఉంది అని అంటూ మీరు కూడా మంచిగా అయిపోతారు మరియు డ్రామాలోని ప్రతి దృశ్యము కూడా మంచిగా అయిపోతుంది ఎందుకంటే మీరు మంచిగా తయారవుతున్న ఆ వైబ్రేషన్, ఎటువంటి దృశ్యాన్ని అయినా, నెగెటివ్ ను కూడా పాజిటివ్ లోకి మార్చేస్తుంది. పిల్లలలో అంతటి శక్తి ఉంది, కేవలం దానిని ఉపయోగించండి. శక్తులైతే ఎన్నో ఉన్నాయి, వాటిని సమయానికి ఉపయోగించి చూడండి, అప్పుడు చాలా మంచి-మంచి అనుభవాలు చేస్తారు.

ఇది కొత్త హాల్ మరియు కొత్త సంవత్సరము, ఇందులో ఏం చేస్తారు? కొత్త సంవత్సరములో ఏదైనా నవీనతను చేస్తారు కదా. ఈ సంవత్సరము అనుభవీ మూర్తులుగా అయ్యి ఇతరులకు కూడా అనుభవము చేయించే సంవత్సరము. ఏం చెయ్యాలో అర్థమైందా? అనుభవము చెయ్యాలి. వాణి ద్వారా వర్ణన అయితే చేస్తూనే ఉంటారు కానీ పిల్లలు ప్రతి ఒక్కరూ ప్రతి శక్తిని, ప్రతి గుణాన్ని అనుభవము చెయ్యాలి. మీరు అనుభవీ మూర్తులు కదా! అనుభవీ మూర్తులా లేక వాణీ మూర్తులా? మీరు అనుభవజ్ఞులే కానీ ఈ సంవత్సరంలో పిల్లలలో ఏ ఒక్కరూ కూడా నాకు ఈ-ఈ విషయాల అనుభవమైతే ఉంది కానీ ఈ విషయంలో అనుభవము చాలా తక్కువ ఉంది అని అనకూడదు. ఈ విధంగా అనే పిల్లలు ఒక్కరు కూడా ఉండకూడదు ఎందుకంటే జ్ఞానము అంటే - కేవలం అర్థం చేసుకోవటం మాత్రమే కాదు కానీ అనుభవము చేయటము అని అర్థము మరియు ఎప్పటివరకైతే అనుభవం చెయ్యరో అప్పటివరకు ఇతరులను కూడా అనుభవజ్ఞులుగా చెయ్యలేరు. ఒకవేళ వాణి వరకే ఉండి, అనుభవము వరకు లేనట్లయితే, ఏ ఆత్మల సేవకైతే

నిమిత్తులుగా అవుతారో, వారు కూడా వాణి ద్వారా చాలా బాగుంది, చాలా బాగుంది, అద్భుతము అని అంటారు, ఇంతవరకే వస్తారు. అనుభవజ్ఞులుగా అయ్యేవారు కోట్లలో కొద్దిమంది, ఆ కొద్దిమందిలో కూడా ఏ ఒక్కరో అవుతారు మరియు ప్రత్యక్షతకు ఆధారము అనుభవము. అనుభవము కల ఆత్మలు ఎప్పుడూ కూడా వాయుమండలము మరియు సాంగత్యపు ప్రభావములోకి రాలేరు. కేవలం వాణి ప్రభావంలోకి వచ్చేవారు ఒక్కోసారి నాట్యము చేస్తారు మరియు ఒక్కోసారి ఆలోచనలో పడతారు. అనుభవము అనగా దృఢమైన పునాది. సగం అనుభవము ఉంటే సగం పునాదే దృఢంగా ఉన్నట్లు, దానికి గుర్తు ఏమిటంటే - వారు చిన్న-చిన్న విషయాలలో కదిలిపోతారు, అచలంగా ఉండరు ఎందుకంటే ఆ వస్తున్న విషయాలు లేక సమస్యలు శక్తివంతమైపోతాయి, అందుకే సగం పునాది ఉన్నవారు ఊగిసలాడుతూ ఉంటారు. పడిపోరు కానీ ఊగిసలాడుతారు. కనుక ముందుగా ఈ సంవత్సరములో మీ అనుభవీ మూర్తి అనే పునాదిని దృఢంగా చేసుకోండి. కొంతమంది పిల్లలు ఈ రోజు చాలా వేగంగా నడుస్తారు కానీ రేపు కాస్త ముఖం మారిపోయి ఉంటుంది, కారణము? అనుభవమనే పునాది దృఢంగా లేదు. అనుభవము కల ఆత్మలు ఎంత పెద్ద సమస్యనైనా - అసలేమీ జరగనే జరగలేదు అన్నట్లు పరిష్కరిస్తారు. సమస్య వచ్చింది మరియు తన పాత్రను పోషించింది అన్నట్లు ఉంటారు, వారు సాక్షీగా అయ్యి, అతీతముగా మరియు ప్రియముగా ఉంటూ ఆటలా చూస్తారు. అది ఒక విషయము కాదు, అది ఒక ఆట, మనోరంజనము. మనోరంజనము మంచిగా అనిపిస్తుంది కదా? కనుక ఏ విషయమైనా, ఒకవేళ పునాది కొద్దిగా అపరిపక్వంగా ఉన్నా, అది మీకు పెద్ద విషయంగా అనిపిస్తుంది. 75 శాతం దృఢంగా ఉన్నా, 90 శాతం దృఢంగా ఉన్నా కూడా అది కదిలే అవకాశం సంభవించవచ్చు. బాప్ దాదాకు పిల్లలు శ్రమ చెయ్యటము అనగా యుద్ధము చెయ్యటము మంచిగా అనిపించదు. శ్రమ ఎందుకు? యుద్ధమెందుకు? మీరు యోగీకి బదులుగా యోధులుగా అయ్యేవారా లేక యోగీ ఆత్మలా? యుద్ధము చేసే సంస్కారము చంద్రవంశములోకి తీసుకువెళ్తుంది మరియు యోగీ ఆత్మల సంస్కారము సూర్యవంశంలోకి తీసుకువెళ్తుంది. మరి ఎలా తయారవ్వాలి? సూర్యవంశీయులుగానా లేక చంద్రవంశీయులుగానా? సూర్యవంశీయులుగా అవ్వాలంటే యుద్ధము సమాప్తము. ఈ సంవత్సరంలో యుద్ధము సమాప్తమైందా? ఇందులో అవును అని అనటం లేదు? చెప్తే అంటారా? బాప్ దాదా చూడకుండానే పిల్లల రిజల్టును చూసేస్తారు. ప్రతి సమయములోని రిజల్టు కళ్ళ ఎదురుగా కాదు కానీ హృదయంలోకి రానే వస్తుంది. ఇక్కడ సాకార వతనంలో ఎప్పుడైతే మీరు కొద్దికొద్దిగానైనా లేక ఎక్కువగానైనా కదిలిపోతారో, అప్పుడు ఎవరో కదులుతూ ఉన్నారు అన్నట్లు తండ్రికి అక్కడ వతనంలో అనుభవమవుతుంది. కావున ఏ విధంగా శాంతివనము యొక్క సంతోషము ఉందో, హాల్ యొక్క సంతోషముందో, అలా బాప్ దాదా మరియు ఇంత పెద్ద సంగరన మధ్యలో ఈ ప్రతిజ్ఞ చెయ్యండి - ఈ సంవత్సరములో అలజడికి అతీతంగా ఉంటూ అచలంగా-స్థిరంగా అవ్వాల్సిందే, అవుతాము అని కాదు, అవ్వాల్సిందే. ఇలానే ఉన్నారా? ఈ విధంగా ఎవరైతే ఆలోచిస్తాము, చేస్తాము, చూస్తాము అని కాకుండా అవ్వాల్సిందే అని భావిస్తున్నారో, వారు చేతులెత్తండి. అచ్చా, అభినందనలు మరియు ఎవరైతే ఏ కారణంగానైనా చేతులెత్తలేదో, అలాగని అవ్వకపోవటమనేది జరగదు కానీ ఏ కారణంగానైనా చేతులెత్తకపోతే వారు ఇప్పుడు ఎత్తండి. చెయ్యి ఎత్తటానికి సిగ్గుగా అనిపిస్తుందా, మరి ఆలోచించండి - చెయ్యి ఎత్తటానికి సిగ్గుగా అనిపిస్తున్నప్పుడు, చేసే సమయంలో కూడా సిగ్గుపడండి. ఇది సిగ్గుపడే విషయము కదా అని అనుకోండి, అప్పుడిక అది జరగదు, దృఢంగా అయిపోతారు ఎందుకంటే కొంతమంది పిల్లలు పదే-పదే అడుగుతూ ఉంటారు, నిమిత్తంగా ఉన్న పిల్లలనైనా లేక ఆత్మిక సంభాషణలో బాప్ దాదానైనా ఒకటే ప్రశ్న అడుగుతూ ఉంటారు - బాబా, వినాశనం యొక్క తారీఖు చెప్పండి. ఈ ప్రశ్న అందరిదీ కదా? అచ్చా, బాప్ దాదా తారీఖు చెప్పారే అనుకోండి - సరే, 2000 సంవత్సరంలో పూర్తవుతుంది, ఏం చేస్తారు? అలాగని ఈ తారీఖు చెప్పటం లేదు, పొరపాటుగా అర్థం చేసుకోవద్దు. ఒకవేళ 2000 సంవత్సరం వరకు ఉంటుంది అని మీకు చెప్తే, మీరేం చేస్తారు అని బాప్ దాదా అడుగుతున్నారు. నిర్లక్ష్యులుగా అవుతారా లేక తీవ్ర పురుషార్థులుగా అవుతారా? తీవ్ర పురుషార్థులుగా అవుతారా! మరియు ఒకవేళ బాప్ దాదా ఈ సంవత్సరంలోనే అలజడి జరుగుతుంది అని చెప్తే అప్పుడేమి చేస్తారు? ఇంకా ఎక్కువ తీవ్ర పురుషార్థం చేస్తారా? లేక కొద్దికొద్దిగా డేట్ కాన్షస్ గా అవుతారా - ఇంత సమయము పూర్తయ్యింది, ఒక నెల పూర్తయ్యింది, ఒక సంవత్సరము పూర్తయ్యింది, ఇంకా ఇన్ని నెలలు మిగిలి ఉన్నాయి... అని ఇలా లెక్క పెడుతూ ఉంటారా! డేట్ కాన్షస్ గా అవుతారా లేక సోల్ కాన్షస్ గా అవుతారా? ఏం చేస్తారు? నిర్లక్ష్యులుగా అవ్వరా? ఇప్పుడింకా నాలుగు సంవత్సరాలు ఉన్నాయి కదా అని ఆలోచించరు కదా? ఏముంది, చివరి సంవత్సరంలో చేసేస్తాములే అని అనుకుంటూ నిర్లక్ష్యులుగా అవ్వరా లేక కొద్ది-కొద్దిగా నిర్లక్ష్యులుగా అవుతారా? మీరు అలా అవ్వకపోయినా సరే మాయ అయితే వింటుంది, అది మీ ముందుకు ఎలాంటి విషయాలను తీసుకొస్తుందంటే ఇక నిర్లక్ష్యము, సోమరితనము అనేవి మధ్యమధ్యలో వస్తాయి, అప్పుడేమి చేస్తారు? అందుకే బాప్ దాదా ఇంతకుముందు కూడా వినిపించారు - డేట్ కాన్షస్ గా అవ్వకండి కానీ ప్రతి సమయాన్ని అంతిమ ఘడియగా భావిస్తూ ప్రతి ఘడియలో అంతగా ఎవర్ రెడీగా ఉండండి. అచ్చా, ఒకవేళ బాప్ దాదా

2000 సంవత్సరం తర్వాత వినాశనమవుతుంది అని చెప్పారనుకోండి, దానిని మీరు అంగీకరించారు అనుకోండి, అలా నిజంగా అవ్వదు కానీ మీరు అంగీకరించారు అనుకోండి, అప్పుడు మీరు 2000 సంవత్సరంలో సంపూర్ణులుగా అవుతారు, మరి ఇతరులను ఎప్పుడు తయారుచేస్తారు? సత్యయుగంలో తయారుచేస్తారా? తయారుచేసేవారు తక్కువమంది ఉన్నారు, కానీ తయారవ్వాల్సినవారు ఎక్కువమంది ఉన్నారు, వారి కొరకు కూడా సమయము కావాలా, వద్దా? తక్కువలో తక్కువ సత్యయుగము ఆది యొక్క 9 లక్షల మంది తయారయ్యారా అని ఇంతకుముందు సీజన్ లో కూడా అడిగారు. అలా తయారవ్వనట్లయితే వినాశనము ఎలా జరుగుతుంది? ఎవరిపై రాజ్యం చేస్తారు? పాత ఆత్మలపై రాజ్యం చేస్తారా? కొత్త ఆత్మలు ఇంకా తయారవ్వలేదు, ఈ లోపు వినాశనమైపోతే ఏం చేస్తారు? అందుకే బాప్ దాదా ఈ పనిని తమ జ్యోతిష్కులైన పిల్లలు ఎవరైతే ఉన్నారో, వారికి అప్పజెప్పారు, ఏదైతే జ్యోతిష్కులు చెయ్యగలరో, ఆ పనిని తండ్రి ఎందుకు చేస్తారు! ఎంతైనా వారు తండ్రి పిల్లలే, వారిని సంపాదించుకోనివ్వండి. వారి సంపాదనకు సాధనము ఇదే. ఒకవేళ ఎవరికైనా తొందర ఉన్నట్లయితే ఆ పిల్లలను అడగండి. బాబా చెప్పరు.

మరి అర్థమైందా - ఈ సంవత్సరం ఏం చెయ్యాలో? అనుభవీ మూర్తులుగా అవ్వాలి. చాలామంది పిల్లలు ఆత్మిక సంభాషణ చేసేటప్పుడు చాలా మధురాతి-మధురమైన ఆత్మిక సంభాషణను చేస్తారు. వారు ఏమంటారంటే - ఏం చెయ్యాలి బాబా, ఇంతైతే అయ్యింది, మిగిలినది మీరు చెయ్యండి, రాజ్యం మేము చేస్తాము కానీ సంపూర్ణంగా మీరు తయారుచెయ్యండి. అలా అవుతుందా? తండ్రి తప్పకుండా సహాయకులే మరియు అంతిమము వరకు సహాయకులుగానే ఉంటారు, ఇది గ్యారంటీ కానీ ఎవరికి సహాయకులు? ఎవరైతే ముందుగా ధైర్యమనే అడుగును వేస్తారో, వారికి తండ్రి సహాయమనే రెండవ అడుగును వేసి సంపూర్ణంగా సహాయం చేస్తారు. ధైర్యము అనే అడుగు వెయ్యకుండా కేవలం - బాబా, మీరు చెయ్యండి, బాబా, మీరు చెయ్యండి అని అంటే, అప్పుడు బాప్ దాదా కూడా - చూద్దాము, ముందు అడుగైతే వెయ్యండి అని అంటారు. ఒక్క అడుగు కూడా వెయ్యకపోతే ఎలా అవుతుంది! అందుకే ఈ సంవత్సరంలో ప్రతి సమయము ఇది చెక్ చేసుకోండి - ధైర్యమనే అడుగు దృఢంగా ఉందా? తండ్రిని అడిగే కన్నా ముందు ఇది చెక్ చేసుకోండి. ధైర్యమనే అడుగు వేసారు కానీ సహాయం లభించలేదు అనేది అసంభవము. కేవలం కాస్త ధైర్యమనే అడుగును వెయ్యండి, అందుకే గాయనంలో కూడా మొదటి మాట ఏమి ఉంటుంది? ధైర్యం పిల్లలది సహాయం తండ్రిది, దీనిని - తండ్రి సహాయము, ఆ తర్వాత పిల్లల ధైర్యము అని తిరగేయకండి. తండ్రి అయితే చిరునవ్వు నవ్వుతూ ఉంటారు - వాహ్ నా ప్రియమైన పిల్లలూ, వాహ్! నిశ్చయంతో ధైర్యమనే అడుగును కాస్త ముందుకు వేసినా సరే, తండ్రి పదమాల రెట్లు సహాయము చేయడానికి పిల్లలు ప్రతి ఒక్కరి కోసము, ప్రతి సమయము సిద్ధంగా ఉన్నారు.

అచ్చా, కొత్త సంవత్సరంలో ఇంకేం చేస్తారు? సేవకు సంబంధించి ఇప్పటికీ ఒక విషయము మిగిలిపోయి ఉంది, అది ఏమిటి? గీతా భగవంతునికి సంబంధించిన విషయమైతే నిరూపణ అయిపోతుంది. కానీ బాప్ దాదా ఇంతకుముందు సంవత్సరం ప్రతి జోన్ వారికి చెప్పారు - స్నేహీలు, సహయోగులు, సంపర్కములోకి వచ్చేవారైతే చాలా మంది తయారయ్యారు మరియు తయారవుతారు కానీ ఇప్పుడు వారసులను తయారుచెయ్యండి. వారసులుగా తక్కువమందిని తయారుచేస్తున్నారు ఎందుకంటే బాప్ దాదా ప్రతి సేవాకేంద్రము యొక్క రోజువారీ రిజల్టును చూస్తారు. నలువైపుల కల రిజల్టులో వారసులు తక్కువగా ఉన్నారు. స్నేహీలు, సహయోగులు బాగా ఉన్నారు, వారిని ముందుకు తీసుకువెళ్ళండి. ఎవరైనా కొత్తవారిని, చివర్లో వచ్చినవారిని వేగంగా తయారుచేసి వారస క్వాలిటీ వారిని తండ్రి ఎదురుగా తీసుకురండి. కొంతమంది తయారవుతున్నారు కానీ అటువంటివారిని లెక్కపెట్టవచ్చు. 2000 సంవత్సరం నాటికి పరివర్తన అవ్వాలి అని కోరుకుంటున్నప్పుడు, అందరూ ఈ విధంగానే కోరుకుంటున్నారు, మరి వారసులుగా ఎంతమందిని తయారుచేసారు? సత్యయుగ ప్రజలు కూడా రాయల్ గా ఉండేవారు కావాలి. అలా తక్కువమంది ఉన్నారు. ప్రజలు తయారయ్యారు, ఇప్పుడు ఏవైతే అనేక రకాల కాన్ఫరెన్సులు చేసారో మరియు బయట స్టేజ్ పై ఏవైతే ప్రోగ్రాములు లభించాయో, వాటిలో ఈ సంవత్సరంలో ప్రభావం మరియు ప్రజలు యొక్క రిజల్టు బాగుంది. కానీ బాప్ దాదా ఏం కోరుకుంటున్నారు? ఇప్పుడు వారస క్వాలిటీ వారిని తయారుచెయ్యండి. ఇక్కడ వారసులను తయారుచేసినట్లయితే అడ్వాన్స్ పార్టీ కూడా ప్రత్యక్షమవుతుంది మరియు తండ్రి పేరు, ప్రత్యక్షతా ఢంకా నలువైపులా మ్రోగుతుంది. ఇప్పటివరకు వచ్చిన రిజల్టులో - వీరు కూడా మంచి పని చేస్తున్నారు అని అంటారు. మరికొంతమంది - వీరే చెయ్యగలరు అని అంటారు. కానీ పరమాత్మ వైపుకు అటెన్షన్ వెళ్ళాలి. పరమాత్మ యొక్క ఈ కార్యము నడుస్తూ ఉంది అన్నది ఇప్పుడింకా గుప్తంగా ఉంది. పిల్లలు తమ శక్తితో, స్నేహంతో తండ్రిని ప్రత్యక్షము చేసేందుకు మంచి పురుషార్థం చేస్తున్నారు కానీ ఎప్పటివరకైతే స్నేహీలుగా, సహయోగులుగా మాత్రమే ఉంటారో అప్పటివరకు తండ్రి యొక్క ప్రత్యక్షత అనేది మైదానములోకి రాదు. ఇంతవరకు చేరుకున్నారు, అది మంచిదే. కానీ

ఎప్పుడైతే అందరి నోటి నుండి - ఇప్పుడిక సమయం వచ్చేసింది, తండ్రి వచ్చేసారు అనే మాట వస్తుందో, అప్పుడు వినాశనం కూడా వస్తుంది. కనుక తండ్రి అంటారు - వినాశనం ఎప్పుడు అవుతుంది అని తండ్రిని అడగకండి. తండ్రి మిమ్మల్ని అడుగుతారు - మీరు ఎప్పుడు తయారవుతారు? పరదా తెరవాలా? తయారుగా ఉన్నారా? లేక పరదా తెరవబడుతుంది కానీ ఇంకా తయారవుతూ ఉంటారా? తక్కువలో తక్కువ 16108 మంది పక్కా-పక్కా రత్నాలను ప్రత్యక్షం చెయ్యండి. మాలనైతే తయారుచెయ్యండి. తయారైందా అని తండ్రి కూడా చూస్తారు. ఇంత అవకాశం ఉంది, ఎక్కువమందిని చెప్పటం లేదు, 9 లక్షల మంది అని చెప్పటం లేదు, 16108 మాలను తయారుచెయ్యండి, ఈ సంవత్సరంలో తయారుచెయ్యండి, 16108 మందితో కూడిన నిర్విఘ్నమైన, అచలమైన మాల తయారుగా ఉందా లేక ఇప్పుడు కొద్దికొద్దిగా ఊగిసలాడుతూ ఉన్నారా అన్నదానిని చూస్తారు. కొద్దికొద్దిగా ఆటను చూపిస్తారా? పాండవులు ఏమనుకుంటున్నారు? చెప్పండి, తయారుగా ఉన్నారా? దాదీలైతే 'అవును' అని చెప్తున్నారు. శక్తులందరూ 'అవును' అని చెప్తున్నారా? 16108 మంది తయారుగా ఉన్నారా? అచ్ఛా, 18వ తారీఖున మాలను తయారుచేసి ఇవ్వాలి, చేతులు ఎత్తమని చెప్తే సగం సభ 16000లో ఉన్నామని అంటారు. మేము 16000లో ఉన్నామని ఎవరైతే భావిస్తున్నారో, వారు - నేను 16000లో ఉన్నానా లేక 108లో ఉన్నానా అన్నదానిని చీటీపై రాసి దాదీలకు ఇవ్వండి, అప్పుడు దాదీలు పాస్ చేస్తారు. చీటీ ఇచ్చేసాము కదా, అయిపోయింది అని అనుకోకండి. ముందు వీరు పాస్ చేస్తారు, ఆ తర్వాత బాప్ దాదా పాస్ చేస్తారు, ఆ తర్వాత ఫైనల్ రిజల్టు చెప్తాము. అచ్ఛా.

నలువైపులా ఉన్న ఉల్లాస-ఉత్సాహాలతో ముందుకు వెళ్ళేవారందరికీ, సదా ఎకానమీ యొక్క అవతారమూర్తులుగా అయ్యి సమయాన్ని, సంకల్పాలను, వాణిని మరియు కర్మలను పొదుపు ఖాతాలో జమ చేసుకునేవారికి, సాకార మరియు ఆకార రూపంలో కొత్త సంవత్సరాన్ని జరుపుకునే సికీలధే పిల్లలకు, బాప్ దాదా చూస్తున్నారు - నలువైపులా ఉన్న పిల్లలు సాకారంలో కాకపోయినా ఆకార రూపంలోనైనా మధుబన్ లోనే ఉన్నారు మరియు ఆకార రూపంలో జరుపుకుంటున్నారు. కావున అందరికీ బాప్ దాదా కొత్త సంవత్సరానికి మరియు శాంతివన్ స్థాపనకు అభినందనలను మరియు ప్రియస్మృతులను ఇస్తున్నారు. సంతుష్టమణులందరికీ నమస్తే.

వరదానము:- తమ ఆది-అనాది స్వరూపపు స్మృతి ద్వారా సర్వ బంధనాలను సమాప్తము చేసే బంధనముక్త స్వతంత్ర భవ

ఆత్మ యొక్క ఆది-అనాది స్వరూపము స్వతంత్రత. ఆత్మ యజమాని. తరువాత పరతంత్రముగా అయ్యింది. కావున మీ ఆది-అనాది స్వరూపాన్ని స్మృతిలో ఉంచుకొని బంధనముక్తులుగా అవ్వండి. మనసు యొక్క బంధనము కూడా ఉండకూడదు. ఒకవేళ మనసు యొక్క బంధనము ఉన్నా సరే, ఆ బంధనము ఇతర బంధనాలను తీసుకొస్తుంది. బంధనముక్తము అనగా రాజు, స్వరాజ్య అధికారి. అటువంటి బంధనముక్త స్వతంత్ర ఆత్మలే పాస్ విత్ ఆనర్ లుగా అవుతారు అనగా ఫస్ట్ డివిజన్ లోకి వస్తారు.

స్లోగన్:- మాస్టర్ దుఃఖహర్తలుగా అయ్యి దుఃఖాన్ని కూడా ఆత్మిక సుఖములోకి పరివర్తన చెయ్యటమే సత్యమైన సేవ.